# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక


సంపుటి : 6 | సంచిక : 183 | పేజీలు : 8 | వెల : రూ.2/- బుధవారం 29 జులై 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## అమరావతిలో జెనోమిక్
# సొల్యూషన్ సెంటర్

**- ఏపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చకున్న ఆస్ట్రాజెనెకా ఇండియా**

- దేశంలోనే మొదటి ప్రెసిషన్ అంకాలజీ పరిశోధనకు ఒప్పందం
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్న ఫార్మా సంస్థ





**అమరావతి,మన జనప్రగతి జులై 28:** కాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్యశాఖ- ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్‌ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. మిగతా2లో...



## నిరసనకారులపై
# చర్యలు వద్దు

- మైనర్లు, నేరచరిత లేని వారిని వదిలేయండి
- విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జులై 28:** పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. 18 ఏళ్లలోపు మైనర్లు, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా సాగిన నిరసనల సమయంలో, విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనలకు మిగతా2లో...



## అంగన్వాడీల విషయంలో
# తప్పుడు ప్రచారం

**వైసీపీపై మంత్రి నారా లోకేశ్ విమర్శలు**

**అమరావతి,మన జనప్రగతి జులై 28:** అంగన్వాడీల విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. గత ప్రభుత్వ మిగతా2లో...

## పెదపెంకి అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై పవన్ కళ్యాణ్ అసంతృప్తి

- క్వాలిటీ కంట్రోల్ అధికారుల నివేదిక ఆధారంగా కాంట్రాక్టర్‌పై చర్యలకు ఆదేశం
- సంబంధిత రోడ్ల బిల్లులు నిలిపివేయాలని ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి



**అమరావతి,మన జనప్రగతి జులై 28:** పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని పెదపెంకి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ తీవ్రంగా స్పందించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత పనుల బిల్లులను వెంటనే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెదపెంకి గ్రామంలో నిర్మించిన కొన్ని మిగతా2లో...

## ప్రజా పంపిణీ ద్వారా ప్రజలకు స్టీమ్ రైస్
# అందేలా ఏర్పాట్లు

- రాష్ట్రంలో అమలుకు సన్నాహాలు
- 1000 మి మార్డుల ఏర్పాటుకు కేంద్రం సహకారం
- రేషన్ బియ్యం లో 10 శాతం నూకల బియ్యం ఉండేలా చర్యలు
- ఢిల్లీ పర్యటనలో పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్



**అమరావతి,మన జనప్రగతి జులై 28:** ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు స్టీమ్ రైస్ అందించడం ద్వారా వారికి పౌర సరఫరాల శాఖ సేవలను మరింత చేరువ చేయొచ్చు. దీనిద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం మిగతా2లో...

# లీక్ నిందితుల్ని శిక్షించాలి

● కోచింగ్ సెంటర్లపై దేశవ్యాప్త విధానం ఉండాలి ● యూనివర్సిటీలపై కేంద్రం ఆధిపత్యం వద్దు ● 'విద్య' రాష్ట్రాల పరిధిలోనే ఉండాలి ● కేంద్రం దాన్ని గుంజుకునే ప్రయత్నాలు మానాలి ● అధికారుల నియామకం రాష్ట్ర ప్రభుత్వ విచక్షణాధికారం ● ఢిల్లీలో మీడియాతో సీఎం ఏ రేవంత్ రెడ్డి ● 11.56 లక్షల ఇండ్లు ఇవ్వండి ● వీబీ గ్రామ్‌జీలో పది కొత్త పనులు చేర్చండి : కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీలో సీఎం విజ్ఞప్తి



**హైదరాబాద్,మన జనప్రగతి జులై 28:** ప్రశ్నపత్రాల లీకేజీలకు కారణమైనవాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్ లోనే సమస్యలు వస్తున్నాయని అభిప్రాయపడ్డారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం అక్కడే ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా యని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని చెప్పారు. దీనిపై జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని మిగతా2లో...

## భవిష్యత్‌లో పేపర్ లీకులకు
# అడ్డుకట్ట

యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్

లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా

గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు

లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్



2లో



## రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తాం

**- ఉప సభాపతి,అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణ రాజు**

**అమరావతి,మన జనప్రగతి జులై 28:** విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గంలో దాదాపు రూ.2000 కోట్లు విలువ చేసే 174.43 ఎకరాల భూమిని బ్యాంకుల జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తామని ఉప సభాపతి మరియు అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘు రామకృష్ణ రాజు మిగతా2లో...

# అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము కాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. అమరావతి క్వాంటం వ్యాలీ– ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించనున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ , నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ , ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి కాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల కాన్సర్ ను ముందుగా గుర్తించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన ఎక్స్ రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనుంది. తద్వారా రోగులను వేగంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్ సేవలు అందటం తో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది. **వైద్య రంగంలో పరిశోధనలకు క్వాంటం వ్యాలీ సేవలు** ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో క్వాంటం పరిశోధనలు జరగాల్సి ఉందని సీఎం సూచించారు. కాలుష్యం లాంటి బాహ్య కారణాల వల్ల కూడా ప్రమాదకరమైన కాన్సర్ బారిన పడుతున్నారని... ముందే గుర్తించి చికిత్సలు అందించటం ద్వారా రోగులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. వైద్య రంగంలోని వ్యవస్థలు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో పనిచేయాలని సీఎం సూచించారు. ఏపీలో సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడి హెల్త్ ప్రొఫైల్ ను డిజిటల్ రికార్డులుగా మారుస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వైద్యారోగ్య రంగంలో మరింత వేగంగా ట్రాన్స్‌ఫర్మేషన్ జరగాల్సి ఉందని తెలిపారు. కేన్సర్ తో పాటు ఇతర వ్యాధులపై కూడా అమరావతి క్వాంటం వ్యాలీ నుంచి విస్తృతంగా పరిశోధనలు జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ జి.సాయి ప్రసాద్, ఆస్ట్రాజెనెకా ఇండియా ఎండీ ఏ. ప్రవీణ్ రావు , స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థల ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ప్రజా పంపిణీ ద్వారా ప్రజలకు స్టీమ్ రైస్ అందేలా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

అందడంతో పాటు, బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనికి కేంద్ర పౌర సరఫరాల శాఖ సహకారం ఎంతో అవసరం అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ చెప్పారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన ఢిల్లీలో కేంద్ర పౌర సరఫరాల శాఖామాత్యులు ప్రహ్లాద్ జోషితో పాటు శాఖ ఉన్నతాధికారులను వరుసగా కలిశారు. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (ఎన్సీసీఫ్) ఎండీ అనీస్ జోసఫ్‌ని కలిసి రాష్ట్రంలో 1000 “మీమార్టు” ల ఏర్పాటుపై తగిన సహకారం కోరుతూ ఎంఓయూ చేసుకున్నారు. అనంతరం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ రవిశంకర్, పాలసీ అండ్ ఎఫ్సీఐ జాయింట్ సెక్రటరీ శిఖాని కలిశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మనోహర్ సీఎంఆర్ సేకరణ, స్టీమ్ రైస్ పంపిణీ, మీ మార్టుల ప్రారంభం, రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతులు వంటి అనేక అంశాలను చర్చించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక పాయింట్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాలను చేపడుతున్న విషయాన్ని కేంద్ర మంత్రివర్యుల వద్ద మనోహర్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రావల్సిన అనుమతులు, సహకారం, పెండింగ్ నిధుల విషయాలను ప్రత్యేకంగా మంత్రివర్యుల ముందుంచారు. రాష్ట్రంలోని 41 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్టీమ్ రైస్ వాడకం ద్వారా అందుతున్న నాణ్యమైన భోజనంపై సానుకూలత ఉందని, దీన్ని ప్రజాపంపిణీ వ్యవస్థకు అనుసంధానం చేసి పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ఓ జిల్లాలో మొదలుపెట్టేలా అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రివర్యుల నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు మనోహర్ తెలిపారు. బియ్యం సంచులపై ఆర్ఎఫ్ఐడీ ను ముద్రించడం ద్వారా అక్రమ రవాణా అరికట్టడానికి దోహదపడుతుందని, దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలన్నారు. రేషన్ బియ్యం లో 10 శాతం నూకల బియ్యం అందిస్తే, ప్రజా పంపిణీలో మంచి ఫలితాలు ఉంటాయని, దీన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు. పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే వివిధ అంశాలపై కేంద్ర మంత్రి వర్యులతో సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. మనోహర్ వెంట పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు ఉన్నారు.

# లీక్ నిందితుల్ని శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందనీ, దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసిన తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామన్నారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడం వల్లే తాము రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని వివరించారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ఇంటర్ సహా పలు పరీక్షా పేపర్ల లీకేజీలతో సంబంధం ఉన్న గ్లోబరీనా వంటి సంస్థలపై ఆనాటి సీఎం కేసీఆర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదనీ, దాని ఫలితంగా ఇప్పుడు ఆ అక్రమాలు సీబీఎస్ఈ పరీక్షల వరకు విస్తరించాయని విమర్శించారు. అలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. **క్షేత్రస్థాయి పరిశీలనకు రండి : కేంద్ర మంత్రికి సీఎం ఆహ్వానం** ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని తాను కేంద్ర మంత్రిని ఆహ్వానించానని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కు సంబంధించి గత కేసీఆర్ ప్రభుత్వం రూ. 8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని తెలిపారు. సక్రమంగా ఉన్నవాళ్లకు బకాయిలు చెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, తమ ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీ వంతపాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. **ఏపీలో కోరండి** కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కే రామచందర్‌రావు, ఆర్. కృష్ణయ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గత ప్రభుత్వ బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నం.

# రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు.మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో ఆయన అధ్యక్షతన ఫిర్యాదుల కమిటీ సమావేశం జరిగింది.అనంతరం అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప సభాపతి రఘురామ కృష్ణ రాజు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు.ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు మరియు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్–కార్డులు(రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో కలిసి చర్చించామని పేర్కొన్నారు.దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు,బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామనన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు,కొణతాల రామకృష్ణ,గురజాల జగన్ మోహన్,విష్ణు కుమార్ రాజు తో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహించారు.ఈమీడియా సమావేశంలో అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ దివాలా తీయడంతో జాతీయ రహదారి–16 కి ఆనుకుని ఉన్న విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూమిని జప్తు చేసుకునేందుకు చేపడుతున్న ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు.అదే విధంగా స్టీల్ ప్లాంట్ కు భూములిచ్చిన వారి పునరావాసం కోసం ఇచ్చిన ఆర్–కార్డులకు సంబంధించి 1203 మందికి రెగ్యులరైజేషన్ పెండింగ్ లో ఉంచారని వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని శ్రీనివాసరావు చెప్పారు. ఇంకా ఈసమావేశంలో కమిటీ సభ్యులు మరియు శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్,విష్ణు కుమార్ రాజు పాల్గొన్నారు.

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జులై 28:** భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఏ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసు కున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# నిరసనకారులపై చర్యలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా, అత్యున్నత న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిర్దోషులపై అతిక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు, తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ' జరగాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలుపడం పౌరుల ప్రాథమిక హక్కు అని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో, వారిపై బలాన్ని ప్రయోగించడం సరికాదని కోర్టు భావించింది. ఈ ఆందోళనల సమయంలో విద్యార్థులపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, గాయపడిన పోలీసుల రక్షణ, వారి భద్రతా పరికరాల గురించి కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కోర్టు పేర్కొంది. శాంతిభద్రతల నిర్వహణ అనేది ద్వితీయ ప్రాధాన్యం కాకూడదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో జరుగుతున్న నిరసనల సమయంలో శాంతిభద్రతల నిర్వహణకు, అల్లర్లను అదుపు చేయడానికి సంబంధించి ఒకే విధమైన ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వేర్వేరుగా ప్రవర్తించడం సరికాదని, నిర్దిష్ట నియమావళి ఉండాలని సూచించింది.

# అంగన్వాడీల విషయంలో తప్పుడు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

హయాంలోనే అంగన్వాడీలకు అమ్మఒడి పథకం అందలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం అమలు చేసిందని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో తనకు మద్దతుగా అంగన్వాడీలు నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీని వైసీపీ నేతలు కావాలనే నిరసన కార్యక్రమంగా చూపుతున్నారని మండిపడ్డారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 'ఫేక్ వర్సెస్ రియల్' పేరుతో వీడియోను విడుదల చేశారు. అంగన్వాడీల పేరుతో విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి తెలిపారు. వైసీపీ హయాంలో అంగన్వాడీ కార్యకర్తలకు అమ్మఒడి ఇవ్వకుండా గొడ్డలి పార్టీ అన్యాయం చేసిందని మంత్రి మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయడంతో సంతోషంతో వారు నా పెనమలూరు నియోజకవర్గ పర్యటనలో కృతజ్ఞతలు తెలిపారు. గొడ్డలిపోటును గుండెపోటుగా ప్రచారం చేసిన గొడ్డలి పార్టీ.. అంగన్వాడీల ఈ కృతజ్ఞత ర్యాలీని, నిరసన ర్యాలీ అంటూ విష ప్రచారం చేస్తోంది' అని ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు.

# పెదపెంకి అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై పవన్ కళ్యాణ్ అసంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)

సిమెంట్ రోడ్లలో పగుళ్లు ఏర్పడిన విషయం ఆయన దృష్టికి వచ్చింది. ఈ అంశంపై రాష్ట్ర స్థాయి చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారిని పెదపెంకి గ్రామానికి పంపించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. తనిఖీల్లో ఐదు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని పవన్ ఆదేశించారు. ఈ సందర్భంగా పెదపెంకిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌తో పాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదపెంకిలో చేపట్టిన రోడ్లు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పెదపెంకిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యతలను స్థానిక శాసనసభ్యులు కూడా తీసుకోవాలని సూచించారు.

# 1న విమానాశ్రయం జాతికి అంకితం: పార్థసారథి

**విజయనగరం,మన జనప్రగతి జులై 28:**

రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధ సారధి భోగాపురంలో మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్ట్ 1 న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ తెలుగు జాతి ఎప్పటికీ మరిచిపోదని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థిక అభివృద్ధికి ఒక అధ్యాయంగా ఈ విమానాశ్రయం మారనుందని తెలిపారు. ఇదే విషయాన్ని ఇన్వెస్టర్స్ పెద్దఎత్తున చర్చించుకుంటున్నారని స్పష్టం చేసారు. ఏపీ అంటే పారిపోయిన పెట్టుబడిదారులు ఇప్పుడు మళ్లీ ఏపీ ప్రభుత్వం వెంట పడుతున్నారని, లోకేష్ తన వ్యక్తిగత పరిచయాలతో పెద్దఎత్తున సాఫ్ట్వేర్ కంపెనీలను తీసుకువస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో భోగాపురం ఎయిర్ పోర్ట్ మరింత విస్తరించనుందని చెప్పుకొచ్చారు. ఏపికి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉత్తరాంధ్ర మారుతుందని, ఉత్తరాంధ్రలో 189 కొత్త ప్రాజెక్టులను ఆరు వేల కోట్లకు పై పెట్టుబడులతో ప్రారంభించారని గుర్తు చేసారు. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయని భరోసా ఇచ్చారు.

# వెయిట్ లిఫ్టర్ అజయ్‌కు అభినందనల వెల్లువ

## - సిఎం, డిప్యూటి సిఎం తదితరుల ప్రశంసలు

**అమరావతి,మన జనప్రగతి జులై 28:** గ్లాస్గోలో జరుగుతోన్న కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించిన వెయిట్ లిఫ్టర్ అజయ్ బాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటి సిఎం పవన్, మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్‌లో చంద్రబాబు స్పందిస్తూ.. గ్లాస్గో 2026 కామన్వెల్త్ క్రీడల్లో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో వల్లూరి అజయ్ బాబు రజత పతకం సాధించారని, తన తండ్రి శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తూ క్రీడా వారసత్వాన్ని విజయవంతంగా కొనసాగించారని కొనియాడారు. అజయ్ సాధించిన ఈ విజయం ఏపీతో పాటు యావత్ భారతదేశానికే గర్వకారణమన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ క్రీడా కీర్తిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. మన్వెల్త్ గేమ్స్–2026లో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలియజేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. గ్లాస్గోలో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించి.. భారత దేశానికి మరో కీర్తిని తెచ్చిపెట్టిన అజయ్ బాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. స్వర్ణ పతకాన్ని అత్యంత స్వల్ప తేడాతో చేజార్చుకున్నా ఛాంపియన్‌గా నిలిచావని కొనియాడారు. అజయ్ బాబు ప్రదర్శన.. ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనమన్నారు.అజయ్ బాబు.. విజయనగరం జిల్లా కీర్తిని ప్రపంచ వేదికపై చాటారని.. తండ్రి వల్లూరి శ్రీనివాసరావు క్రీడా వారసత్వాన్ని కొనసాగించారని పవన్ అన్నారు. భారతదేశానికి మరో గర్వకారణమైన విజయాన్ని అజయ్ అందించారన్నారు. తమ బిడ్డలలో ఒకరు భారత్‌కు కీర్తిని తెచ్చిపెట్టినందుకు ఆంధ్రప్రదేశ్ ఎంతో గర్వపడుతోందని అన్నారు. ప్రపంచ వేదికపై మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ.. అజయ్ బాబుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబును మంత్రి నారా లోకేశ్ అభినందిస్తూ.. తండ్రికి తగ్గ తనయుడు అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'గ్లాస్గో 2026లో పురుషుల 79 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబుకు హృదయపూర్వక అభినందనలు. తన తండ్రి వల్లూరి శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తూ, అజయ్ యావత్ దేశానికి గర్వకారణంగా నిలిచాడు. అతను మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశిస్తున్నాము' అంటూ ఎక్స్‌లో లోకేశ్ పోస్ట్ చేశారు.

## వేంపల్లెలో జనవరి లోగా రోడ్ల విస్తరణ పనుల పూర్తి.

### - వేంపల్లె ఆర్ అండ్ బి ఏఈ మనోహర్ రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జులై 28:**-వచ్చే ఏడాది జనవరిలోగా వేంపల్లిలో చేపట్టిన కడప- పులివెందుల ఆర్ అండ్ బి రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేస్తామని వేంపల్లి రోడ్లు భవనాల శాఖ ఏఈ మనోహర్ రెడ్డి తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి సమీపంలోని కడప రోడ్డులో మంగళవారం చేపట్టిన మురుగుకాలువ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మేజర్ డిస్టిక్ రోడ్స్ పథకం కింద రూ 47 కోట్లతో కడప -పులివెందుల రోడ్డు పనులను విస్తరిస్తున్నామన్నారు. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు, పులివెందుల రోడ్ లోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కడప రోడ్డులోని హనుమాన్ జంక్షన్ వరకు నాలుగు వరుసల సిమెంట్ రోడ్డు, మధ్యలో 5 అడుగుల డివైడర్, రోడ్డుకు ఇరువైపులా పాదచారులు నడిచేందుకు ఫుట్పాత్ పనులు చేయిస్తున్నామన్నారు . ఈ పనుల పూర్తికి గుత్తేదారుకు 2027 మార్చి వరకు గడువు ఉందన్నారు. అయితే వీలైనంతవరకు ఈ పనులు సత్వరం పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ప్రణాళిక బద్ధంగా రోడ్డు పనులు చేయి స్తున్నామన్నారు. ఇప్పటికే ఓవైపు రోడ్డు నిర్మాణం పూర్తయిందని, ఆర్టీసీ బస్సులు బైపాస్ రోడ్ల మీద కాకుండా త్వరలో వేంపల్లి పట్టణం మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిన్నచిన్న అడ్డంకులను అధిగమించి జనవరి నెలాఖరులోగా ఎట్టి పరిస్థితుల్లో ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయిస్తామని ఏఈ మనోహర్ రెడ్డి వెల్లడించారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్తున్న "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం



**పత్తికొండ మన జనప్రగతి జులై 28:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయాలను ప్రజలకు వివరించే "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం మంగళవారం పత్తికొండ మండలం వాటికల్లుగుండు గ్రామంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ శాసనసభ్యులు శ్రీ కె.ఈ. శ్యాం కుమార్ గారు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా పారదర్శక పాలనతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని అన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. మై టిడిపి ఆప్ లో ప్రతి ఒక్కరు ఫొటోస్ అప్లోడ్ చేయాలని ఆయన సూచించారు. అలాగే బూత్ ఇన్చార్జిలు, క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు మరియు ప్రతి కార్యకర్త తప్పనిసరిగా తమ తమ కార్యక్రమాల ఫోటోలను మై టిడిపియాప్‌లో అప్లోడ్ చేయాలని, ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని సంబంధిత అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో పార్టీ అబ్జర్వర్ శ్రీ వడ్డె పూలన్న గారు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువత, అభిమానులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## వసతి గృహాల్లో విద్యార్థి సంఘాల ప్రవేశంపై నిషేధ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

### - ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 28:**-రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.బి.బంగి శివ డిమాండ్ చేశారు,మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వం వారి సమస్యలను వెలుగులోకి తెచ్చే విద్యార్థి సంఘాలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు, ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం,తాగునీరు, పారిశుద్ధ్యం,మరుగుదొడ్లు, సిబ్బంది వంటి మౌలిక సదుపాయాల కొరత ఇప్పటికీ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడుతున్నది విద్యార్థి సంఘాలేనని తెలిపారు.ఒకే ఒక్క సంఘటనను ఆధారంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించడం సమంజసం కాదని, సంబంధిత ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి,విద్యార్థి సంఘాలనే హాస్టళ్లకు దూరం చేయడం సరికాదని అన్నారు, విద్యార్థి సంఘాలు రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన ప్రజాస్వామ్య సంస్థలని,వాటికార్యకలాపాలను అడ్డుకోవడం విద్యార్థుల రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించకుండా వాటిని ప్రశ్నించే గొంతులను అణచివేయడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శించారు,ప్రజాస్వామ్య హక్కులను హరించే ఈ ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి విస్తృత స్థాయిలో ఆందోళనలు చేపడతామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ హెచ్చరించింది.

## జేఎన్టీయూ పులివెందులలో విద్యార్థులకు 'కెరీర్ అవేర్‌నెస్' సదస్సు




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 28:** స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఎపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో కడప జిల్లా డిఎస్డీఓ విజయ్ వినీల్ కుమార్ ఆదేశాల మేరకు విద్యార్థులకు "కెరీర్ అవేర్‌నెస్ సెషన్ ఆన్ సెంట్రల్ & స్టేట్ గవర్నమెంట్ జాబ్స్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పి.మహేష్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ భవిష్యత్ కెరీర్‌లో ఏ విధంగా ముందుకు వెళ్లాలి,కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు (సెంట్రల్ & స్టేట్ గవర్నమెంట్ జాబ్స్ ) ఎలా సన్నాహం కావాలి,పోటీ పరీక్షలకు (కాంపిటీటివ్ ఎగ్జామ్స్ ) సిద్ధమయ్యే విధానాల గురించి వివరించారు.అలాగే స్వయం ఉపాధి కోసం సొంతంగా బిజినెస్ ప్రారంభించడం, ఉన్నత చదువులు (హయ్యర్ స్టడీస్ ) చదవడం మరియు విదేశాలకు వెళ్లే అవకాశాల (ఫారిన్ ఒపోర్చ్యూనిటీస్ ) గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో చంద్రమోహన్, పద్మావతిలతో పాటు జేఎన్టీయూ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేష్,చంద్రశేఖర్,వివిధ విభాగాల అధిపతులు (హెచ్ఓడీ) మరియు కళాశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జిల్లాలోని గ్రంథాలయాలకు త్వరలో పోటీ పరీక్షల పుస్తకాలు.

### • జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాను ప్రకాష్.



**వేంపల్లె మన జనప్రగతి జులై 28:**-జిల్లా లోని నిరుద్యోగ యువతకు మేలు చేయాలన్న ఉద్దేశంతో జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకు త్వరలో పోటీ పరీక్షల కు అవసరమయ్యే పుస్తకాలను పంపించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ దాసరి భాను ప్రకాష్ అన్నారు.స్థానిక పాతపేట లో ఉన్న గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించడమే కాకుండా , అలాగే అక్కడున్న పుస్తకాలను పరిసరాల శుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సుష్మ స్థానిక బిజెపి నాయకులతో కలిసి గ్రంధాల చైర్మన్ ను కలిశారు. త్వరలో జరగపోయే డీఎస్సీ ,ఎపి ట్రాన్స్కో, వివిధ రకాల పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని నిరుద్యోగ యువకులకు అవసరమైన వాటికి అనుగుణంగా పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచి స్థానిక నిరుద్యోగులకు ఉపయోగపడేలా చూడాలని వారు చైర్మన్ కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సదరు చైర్మన్ కు భాజపా నేతలు వినతిపత్రం కూడా సమర్పించారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ ఈ విషయమై తాను గ్రంథాలయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో జిల్లాలోని గ్రంథాలయాల అన్నింటికీ పోటీ పరీక్షల పుస్తకాలు తెప్పించేందుకు కృషిచేస్తానన్నారు. విద్యార్థులు,ఉద్యోగార్థుల, విశ్రాంత ఉద్యోగులు,జ్యేష్ఠ పౌరులు గ్రంథాలయంలో ఒక్కసారి రూ 100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే జీవితమంతా ఉచితంగా పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి చదువుకుని తిరిగి ఇవ్వొచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకుని అటు మన జ్ఞానాన్ని పెంపొంది ంచుకోవాలని, ఇటు గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. వేంపల్లి శాఖ గ్రంథాలయ అధికారిణి టి.వనజకుమారి, బిజెపి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు దొంతు సుమన్, వృషభాచలేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యుడు సునీల్ కుమార్, బిజెపి ఐ.టి. సెల్ కన్వీనర్ ప్రసాద్ రెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నరు.

# కొత్తపల్లెలో ప్రత్యేక గ్రామసభ..

### పంచాయతీ -మున్సిపల్ విలీనంపై ప్రజాభిప్రాయ సేకరణ



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 28:-** ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఐదు గ్రామ పంచాయతీల విలీన ప్రక్రియలో భాగంగా కొత్తపల్లె గ్రామ పంచాయతీలో మంగళవారం ప్రత్యేక గ్రామసభ ప్రశాంతంగా నిర్వహించారు. గతంలో ప్రజాభిప్రాయ సేకరణపై వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో ఈసారి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేసి, పారదర్శకంగా అభిప్రాయ సేకరణ చేపట్టారు. గ్రామసభకు హాజరయ్యే ప్రజలను ఆధార్ లేదా ఓటరు గుర్తింపు కార్డుల పరిశీలన అనంతరం మాత్రమే అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ విభూ కృష్ణ ఆదేశాల మేరకు రూరల్ సీఐ నాగభూషణ్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామసభలో జమ్మలమడుగు డీడీఓ, స్పెషల్ ఆఫీసర్ మంజులవాణి, డీఎల్‌పీఓ నూర్జహాన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస విశ్వనాథ్, డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు పంచాయతీగా కొనసాగడం వల్ల కలిగే ప్రయోజనాలు, మున్సిపాలిటీలో విలీనం అయితే లభించే పట్టణ స్థాయి సౌకర్యాలు, అభివృద్ధి అవకాశాలను ప్రజలకు వివరించారు. ప్రజల అభిప్రాయాలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నమోదు చేసేందుకే ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మాజీ ఎంపీపీ మల్లెల ఝాన్సీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కొనసాగితే స్థానిక పాలనకు మరింత ప్రాధాన్యత ఉంటుందని, గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలని కోరారు. మాజీ సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలకే ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాభివృద్ధికి ఉపయోగపడే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. టీడీపీ నాయకుడు బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో విలీనం జరిగితే మెరుగైన మౌలిక వసతులు, పట్టణ స్థాయి సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం స్త్రీ, పురుషులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి నాలుగు రిజిస్టర్లను అందుబాటులో ఉంచారు. సేకరణ పూర్తయిన అనంతరం రిజిస్టర్లను కడప డీపీఓ ఆదేశాల మేరకు మూసివేసినట్లు అధికారులు తెలిపారు. సేకరించిన ప్రజాభిప్రాయాన్ని డీపీఓ ద్వారా జిల్లా కలెక్టర్‌కు నివేదిక రూపంలో సమర్పించనున్నట్లు వెల్లడించారు.ఇప్పటికే చౌటపల్లె, దొరసానిపల్లె, గోపవరం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించగా, ఈ నెల 30న సోములవారిపల్లెలో గ్రామసభ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.


## కంపెనీ సెక్రటరీ కోర్సులో కుప్పాలపల్లె రైతుబిడ్డ అద్భుత ప్రతిభ

### - జయంత్ కుమార్ రెడ్డికి పట్టా అందించిన వర్సిటీ ప్రెసిడెంట్



**వేంపల్లె మన జనప్రగతి జులై 28:**-మండలం లోని మారు మూల గ్రామానికి చెందిన కుప్పాలపల్లి కు చెందిన రైతు బిడ్డ కుడుముల జయంత్ కుమార్ రెడ్డి కంపెనీ సెక్రటరీ కోర్సులో అద్భుత ప్రతిభ సాధించారు. వంద మంది లో పది మంది ఉత్తీర్ణులయ్యే ఈ కోర్సులో జయంత్ విజయవంతంగా కోర్సు పూర్తి చేసి వర్సిటీ ప్రెసిడెంట్ వైస్ ప్రెసిడెంట్ ల చేతుల మీదుగా సగర్వంగా డిగ్రీ పట్టా అందుకున్నారు. కుప్పాలపల్లి గ్రామానికి చెందిన రైతు కుడుముల ప్రభాకర్ రెడ్డి కృష్ణ కుమారి దంపతుల కుమారుడైన జయంత్ కుమార్ రెడ్డి ఢిల్లీ కేంద్రంగా ఉన్న ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ ) ఎంట్రన్స్ పరీక్ష రాసి ప్రతిభ కనబరిచి ఐదేళ్ల కంపెనీ సెక్రటరీ కోర్సులో జాయిన్ అయ్యారు. ఈ మేరకు సదరు విద్యార్థి తన తల్లిదండ్రుల కష్టాలను కళ్లారా చూసి రేయింబవళ్లు కష్టపడి చదివి క్లిష్టతరమైన ఈ కంపెనీ కోర్సు పూర్తి చేశారు. ఈ కోర్సులో 100 మంది చేరితే పదిమంది మాత్రమే ఉత్తీర్ణులవుతారు. అలాంటి కోర్సును ఈ విద్యార్థి విజయవంతంగా పూర్తి చేసి ఇటీవల కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో జరిగిన వర్సిటీ స్నాతకోత్సవంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ )ప్రెసిడెంట్ సి ఎస్ పవన్ జి చందక్, వైస్ ప్రెసిడెంట్ ద్వారకనాథ్ చెన్నూరు చేతులమీదుగా డిగ్రీ పట్టాను అందుకున్నారు. ఐదేళ్ల కోర్సు పూర్తి చేసి వర్సిటీ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ చేతులమీదుగా పట్టానందుకోవడం మరువలేని అనుభూతినిచ్చిందని సదరు విద్యార్థి తెలిపారు. తల్లిదండ్రులు కృష్ణకుమారి ప్రభాకర్ రెడ్డి కష్టంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని వారికి జన్మజన్మల్లో రుణపడి ఉంటానని ఆ విద్యార్థి పేర్కొన్నారు.

## మంగంపేట ఏపీ ఎండీసీలో..రోడ్డు పర్మిట్ లేని లారీలు ముగ్గురాయిని సరఫరా చేస్తున్న పట్టించుకోని సంబంధిత ఉన్నతాధికారులు



**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 28:-** ఓబులవారిపల్లి మండలం మంగంపేట ఏపీఎండిసి పరిధిలో ఎటువంటి పరిమితులు లేకుండా ట్రాఫిక్ నేమ్ తెలియదు కొంతమంది యజమానులకు సంబంధించిన లారీలు సంస్థ డంపింగ్ నుంచి పలువు ే ంజింగ్ బిల్లులకు అలాగే పలు ఎక్స్పోర్ట్ కంపెనీలకు సరఫరా చేస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం కొన్ని సంవత్సరాలుగా సాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిద్ర వస్తువులు ఉన్నట్లు తెలుస్తోంది. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు అటు యజమాను లు ఇటు బాధితులు తీవ్రంగా నష్టపోయి కనీసం ఇన్సూరెన్స్ కూడా లేకుండా ఉండే పరిస్థితి దాపురిస్తుందని పలువురు కార్మిక నాయకులు కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు అసలే ప్రమాద అంచున రవాణా సౌకర్యం ఉన్నప్పటికీ ఏమాత్రం బేఖాతలు చేయకుండా నిర్లక్ష్యంగా రోడ్డు పరిమితులు లేకుండా కొంతమందికి లైసెన్సులు లేకుండా ఈ ముగ్గురాయి రవాణా సౌకర్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతూ వారి వ్యాపారం భావిస్తున్నారంటే విమర్శలు వినపడుతున్నాయి ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు సౌకర్యానికి సంబంధించిన రోడ్డు పరిమితులు అలాగే లైసెన్స్ కలిగిన రివర్లను నియమించుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తూ అధికారులను కోరుతున్నారు

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక



## స్మార్ట్ కిచెన్ సెంటర్ పరిశీలన..

### - త్వరలో ప్రజలకు అందుబాటులోకి



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 28:**–సిద్ధవటం మండల కేంద్రంలోని ఎగువపేట బస్టాండ్ సమీపంలో నిర్మించిన స్మార్ట్ కిచెన్ సెంటర్‌ను కడప పంచాయతీరాజ్ ఎస్ఈ మర్దన్న మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట, ఒంటిమిట్ట, సిద్ధవటం ప్రాంతాల్లో నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ సెంటర్ల పనులను సమీక్షించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా స్మార్ట్ కిచెన్ సెంటర్ల విస్తరణ వేగంగా కొనసాగుతోందని, తొలి దశలో ఏర్పాటు చేసిన కేంద్రాలు ఇప్పటికే విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. సిద్ధవటం కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పన చివరి దశకు చేరుకుందని, మరో పది రోజుల్లో పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ పరిశీలనలో పంచాయతీరాజ్ ఎస్‌సీ నాగరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి సందర్భంగా షిర్డీ సాయిబాబా ఆలయంలో విశేష పూజలు

### - భక్తిశ్రద్ధలతో గ్రామెత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహణ



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 28:**–గురు పౌర్ణమి సందర్భంగా సిద్ధవటం మండలం మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్.కె.ఆర్. నగర్‌లో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవమూర్తిని పూలతో సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఘనంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంజాయి సమాచారానికి 1972కు ఫోన్ చేయండి: సీఐ కొండారెడ్డి




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 28:**–కడప జిల్లా ఎస్పీ నచికేత్ ఐపీఎస్, ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూ కృష్ణ ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెన్నానగర్‌లో ఈగల్ టీం ఆధ్వర్యంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ కొండారెడ్డి మాట్లాడుతూ, ప్రజలు తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి సేవించడం, విక్రయించడం లేదా సరఫరా చేయడం గమనిస్తే వెంటనే 1972 హెల్ప్‌లైన్, డయల్ 100, 112 లేదా ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, ఇచ్చిన సమాచారంపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు.. పరిసరాల పరిశుభ్రతే మార్గం

**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 28:**–మండల పరిధిలోని దేవగిరి గ్రామంలో డెంగ్యూ,మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం.. దోమలు కుట్టకూడదు..దోమలు పుట్టకూడదు,అనే నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు ప్రతి ఇంట్లో వారానికి ఒకసారి డ్రైడేఫ్రైడే పాటించి నీరు నిల్వ ఉండే పాత్రలు,కుండీలు, కూలర్లు,టైర్లు తదితరాలను శుభ్రం చేయాలని,దోమతెరలు ఉపయోగించి దోమల కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు,ఈ చర్యల ద్వారా విషజ్వరాల వ్యాప్తిని నివారించవచ్చని వివరించారు,ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,ఆశ కార్యకర్త శ్రావణి,అంగన్‌వాడీ కార్యకర్త శైలజమ్మ,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్
- రెవెన్యూ, అటవీ శాఖ, ఎల్ నినో ప్రభావంపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్




**తిరుపతి మన జనప్రగతి జూలై 28:**–రాష్ట్రంలో రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏపీ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ సమస్యలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, 22ఏ, రీ–సర్వే, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, అటవీ భూములు, వ్యవసాయంపై ఎల్ నినో ప్రభావం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ–సర్వే ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సర్వే ప్రారంభానికి ముందు భూ యజమానులకు ముందస్తుగా సమాచారం అందించాలని, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్‌లో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నందున రైతులు రసాయన ఎరువులపై ఆధారపడకుండా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లేలా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.జిల్లా కలెక్టరేట్ నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డీఆర్వో జి. నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాశ్ రెడ్డి, దేవేంద్రరెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ ప్రసాదరావు, ల్యాండ్స్ అండ్ సర్వే ఏడీ రామచంద్రతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ సేవలపై అభిప్రాయాలకు క్యూఆర్ కోడ్ వినియోగించండి

- ప్రభుత్వ సేవల నాణ్యత మెరుగుదలకు ప్రజల ఫీడ్‌బ్యాక్ కీలకం
- ఎంపీడీవో ఫణి రాజా కుమారి



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 28:**–ప్రభుత్వ శాఖలు అందిస్తున్న సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్ధవటం మండల అభివృద్ధి అధికారి యస్. ఫణి రాజా కుమారి కోరారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ సమావేశాల్లో వినతిపత్రాలు సమర్పించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేసి, అందిన సేవలపై తమ అభిప్రాయాలు, సూచనలు నమోదు చేయాలని ఆమె తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ప్రభుత్వ సేవల పనితీరును సమీక్షించి అవసరమైన మెరుగుదల చర్యలు చేపట్టడం లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా, మండల పీజీఆర్ఎస్ కేంద్రాలు, మండల కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, హెల్ప్‌లైన్ కేంద్రాలు, సహాయ డెస్కులు, ఫిర్యాదుల స్వీకరణ కౌంటర్లలో ఈ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ సేవలపై తమ అభిప్రాయాలను నేరుగా తెలియజేయాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

## గొడ్డలి పార్టీ గోడు ప్రజలు నమ్మరు

### - తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 28:**–గొడ్డలి పార్టీ గోడు ప్రజలు నమ్మరనీ టిడిపి సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా అన్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆదేశాలతో గౌరవ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మరియు మంత్రి తమ్ముడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి సూచనలతో నిర్వహించిన ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎప్పటికీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండాలని వార్డులలో ప్రజలు దీవెనలు అందిస్తున్నారని ఇంత మంచి ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచించే ఏకైక ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారంటే నారా చంద్రబాబు నాయుడు ఒక్కరే అని వృద్ధులు వితంతువులు వికలాంగులు రైతులు యువత ప్రతి ఒక్కరి నోటినుండి వినిపిస్తున్న మాట అని చెప్పారు ప్రజలలో వస్తున్న జనాధరణను చూసి ఓర్వలేక వైసిపి పార్టీ అభివృద్ధి జరగకుండా అడ్డుకోవాలని చూస్తుందని చెప్పారు రాష్ట్రంలో ప్రశాంతత లేకుండా పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని చెప్పారు డీఎస్సీలో పారదర్శకంగా పోస్టులు భర్తీ చేస్తే ఫేక్ వైసీపీ బ్యాచ్ మంత్రివర్యులు నారా లోకేష్ పై ఆరోపణలు చేస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు దమ్ముంటే చర్చకు రండి అని గొడ్డలి పార్టీ బ్యాచ్ కు సవాల్ విసిరారు కష్టపడి చదివి నిరుద్యోగులు ఉద్యోగం సాధిస్తే వారిని కూడా నానా బూతు మాటలు వైసిపి నాయకులు మాట్లాడటం సమంజసం కాదని తెలిపారు అనంతరం టిడిపి రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం గురించి ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు వార్డులోని ప్రజలు మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నీటి సౌకర్యం రోడ్డు సౌకర్యం కల్పించారని గత వైసిపి ప్రభుత్వంలో పట్టించుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బలరాం యూనిట్ ఇంచార్జ్ మణికంఠ బుద్ధి ఇంచార్జ్ మల్లికార్జున అమీర్ భాష రాజు సూరి రోఫా హైదర్ మరి యు తదితరులు పాల్గొన్నారు.


## జూలై 29న తిరుమలలో పౌర్ణమి గరుడసేవ



**తిరుమల మన జనప్రగతి జూలై 28:**–తిరుమలలో జూలై 29న పౌర్ణమి సందర్భంగా గరుడసేవను వైభవంగా నిర్వహించనున్నారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్పస్వామివారు సువర్ణకాంతులతో మెరిసే గరుడవాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనం ఇవ్వనున్నారు.ఈ పౌర్ణమి గరుడసేవను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులు క్రమశిక్షణతో దర్శనాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## నేడే శ్రీ శీతల గంగమ్మ 23వ జాతర మహోత్సవం

- బుధ, గురువారాల్లో వైభవంగా ఉత్సవాలు
- వేలాది మంది భక్తుల రాకకు విస్తృత ఏర్పాట్లు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 28:**–సిద్ధవటం మండలం మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి 23వ జాతర మహోత్సవం బుధ, గురువారాల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో నిర్వహించే ఈ జాతరకు విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. గ్రామాల్లో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని గ్రామ పెద్దలు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే గ్రామదేవతగా శ్రీ శీతల గంగమ్మ అమ్మవారిని భక్తులు విశ్వసిస్తారు. జాతరలో భాగంగా బుధవారం అమ్మవారి మట్టి ప్రతిమను తయారు చేసి వేప పందిరిలో ప్రతిష్ఠించనున్నారు. అనంతరం గ్రామ మహిళలు పెద్ద ఎత్తున అంబళ్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గురువారం భక్తుల దర్శనార్థం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయగా, భక్తులు యాటలు, కోళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు. జాతర సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇల్లు బంధుమిత్రులతో కళకళలాడనుండగా, సాయంత్రం నిర్వహించే అమ్మవారి శోభాయాత్రలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని జాతర నిర్వాహకులు తెలిపారు. జాతీయ రహదారిపై జాతర నిర్వహించబడుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలు పోలీసుల పర్యవేక్షణలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల మధ్య కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. రాత్రి అమ్మవారి నిమజ్జనంతో జాతర మహోత్సవం ముగియనుంది.

## గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 28:**– గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని ఈ నెల 30 న కలెక్టర్ ఆఫీస్ ఎదుట జరిగే ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. జిల్లా లో గ్రామ పంచాయతీ కార్మికులకు అపరిష్కృత సమస్యలు ఉన్నందున రెండు రోజులు పాటు జిల్లా కమిటీ జీపు జాత చేపట్టిందని అందులో భాగంగా బుధవారం స్థానిక చెన్నముక్కపల్లి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ఉద్దేశించి గ్రామ పశీశీచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు బీవీ రమణ ప్రధాన కార్యదర్శి సురేంద్ర బాబు, కోశాధికారి హరిబాబు లు మాట్లాడుతూ గత ఇరవై సంవత్సరాలనుండి గ్రామలో పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయకపోగా జిల్లా వ్యాప్తంగా 8–12 నెలలు వేతనాలు పెండింగ్ లో ఉంటే కుటుంబాలు ఏ విధంగా జీవించాలని ప్రశ్నిశీచారు. 12పిఆర్ సీ అమలు చేయాలని, గౌరవ హై కోర్టు ఆదేశాల ప్రకారం ప్రపోసల్స్ పెండింగ్ లేకుండా చూడాలని సంక్షేమపతకాలు అమలు చేయాలని కోరారు.వేతనాలు సక్రమంగా రాక పోవడం తో చాలా మంది పని మానేసుకున్నారని దీశితో గ్రామాల్లో పారిశుధ్యం కుంటుపడిందన్నారు. కనీస వేతనం 26 వేల అమలకు31 న కలెక్టర్ ఆఫీస్ ఎదుట జరిగే ధర్నా ని రాయచోటి డివిజన్ లోని పంచాయతీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాగ్యలక్ష్మి పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జి. మాధవయ్య పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏ వి రమణ ,దేవరాయలు అంజి, రెడ్డెయ్య,శ్రీరాములు సుభద్రమ్మ లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు

## లోకేష్ రాజీనామా చేయాలి: వైఎస్సార్సీపీ డిమాండ్




**కడప మన జనప్రగతి జూలై 28:**–రాష్ట్రంలో నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని వైఎస్సార్సీపీ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే మెగా డీఎస్సీని రద్దు చేసి పారదర్శకంగా మళ్లీ నిర్వహించాలని కోరారు.ఈ మేరకు వైఎస్సార్సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం కడప నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ఏడురోడ్ల మీదుగా వన్‌టౌన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు సాగింది. అక్కడ మెగా డీఎస్సీ నియామకాలపై తమ వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి సమర్పించారు.ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా మాట్లాడుతూ, నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లే, రాష్ట్రంలో మెగా డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.మెగా డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. స్పోర్ట్స్ కోటాలో భారీగా లంచాలు తీసుకుని ఉద్యోగాలు అమ్ముకున్నారంటూ ఆరోపించారు. కోచింగ్ సెంటర్లకు లక్షల రూపాయలు ఖర్చు చేసి పరీక్షలకు సిద్ధమైన నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీని వెంటనే రద్దు చేసి నిష్పక్షపాతంగా తిరిగి నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు ఎం.వి.రామచంద్రారెడ్డి, పి.రామసుబ్బారెడ్డి, కే.సురేష్‌బాబు, మాజీ మేయర్ పాకా సురేష్, మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, డాక్టర్ సోహెల్, దుగ్గాయిపల్లి మల్లికార్జున్ రెడ్డి, దాసరి శివ, జయచంద్రరెడ్డి, నాగరాజు, జమీల్, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైఎస్సార్సీపీ విద్యార్థియువజన విభాగం అధ్యక్షుడు దత్తసాయి, గుంటి నాగేంద్రతో పాటు మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చెన్నూరుకు చెందినడాక్టర్ తప్పెట నీల్ రోహిత్ రెడ్డికి అమెరికా తెలుగు సంఘం (ఆటా) సభలకు ఆహ్వానం





**చెన్నూరు మన జన ప్రగతి జులై 28:**–చెన్నూరు గ్రామానికి చెందిన ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డి ఆచార్య రమాదేవి ఇరువురు యోగి వేమన విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు డాక్టర్ నీల్ రోహిత్ రెడ్డి.ఎం బి బిస్. పూర్తి చేసిన తర్వాత ఎమర్జెన్సీ మెడిసిన్ లో పి.జి పూర్తి చేశారు .ఆ తర్వాత లండన్ లో వైమానిక అత్యవసర వైద్యం లో ఫెలోషిప్ చేశారు.గత ఆరు సంవత్సరాలుగా హైదరాబాద్ లో వివిధ ఆసుపత్రులలో పనిచేస్తూ రోగులకు అత్యవసర చికిత్స చేస్తున్నారు.కరోనా వైరస్ విజృంభిస్తున్న సమయంలో అనేక మంది ప్రాణాలు కాపాడారు. ఆ తర్వాత అత్యవసర పరిస్థితుల్లో రోగులను విమానం ద్వారా ఆసుపత్రులకు సురక్షితంగా తరలించే శిక్షణను లండన్ లో తీసుకున్నారు.హెలికాప్టర్,విమానాల ద్వారా ప్రాణాపాయం లో ఉన్న వారిని సురక్షితంగా ఆసుపత్రికి తరలించి వైద్యం లో నైపుణ్యం సంపాదించారు. ఐ సి ఏ టి టి, అనే సంస్థ లో 3సంవత్సరాలు పనిచేశారు.మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఉచితంగా అత్యవసర వైద్యం కోసం రోగులను హాస్పిటల్ కు విమానంలో,హెలికాప్టర్లలో తరలించే పథకం ప్రారంభించింది.డాక్టర్ నీల్ రోహిత్ రెడ్డి భోపాల్ లో పనిచేస్తున్న సమయంలో మొట్టమొదటిసారిగా ఈ పథకం ద్వారా పేషెంటును సురక్షితంగా విమానంలో తరలించే సమయంలో రోగికి ఎలాంటి ప్రాణాపాయం కలగకుండా అందుబాటులో ఉండి ఎయిర్ అంబులెన్స్ లో వైద్యం అందించారు c ఆ తరువాత హైదరాబాద్ నుంచి భారతదేశంలోని వివిధ ఆసుపత్రులకు మరియు వివిధ దేశాలకు రోగులను తరలించే సమయంలో ఎయిర్ అంబులెన్స్ లో డాక్టర్ గా పనిచేస్తు సేవలందించారు.అనేక మంది నిరుపేద రోగులకు అత్యవసర సమయాల్లో వైద్యం అందించారు.ప్రస్తుతం రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ అనే సంస్థ ను స్వయంగా స్థాపించారు.ఈ సంస్థ ద్వారా ప్రపంచవ్యాప్తంగా రోగులను విమానాల్లో,హెలికాప్టర్ లో అత్యవసర సమయాల్లో వివిధ ఆసుపత్రులకు తరలించే సమయంలో అందుబాటులో ఉంటూ ప్రాణాలను కాపాడటం లో సహాయం చేస్తున్నారు.డాక్టర్ నీల్ రోహిత్ రెడ్డి ఇప్పటికే 32 దేశాలకు పైగా రోగులను చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించే సమయంలో అందుబాటులో ఉన్నారు. వీరి సేవలను గుర్తించిన ఏ టి ఏ కాన్ఫరెన్స్ ఈనెల 31 నుంచి ఆగస్టు 2 తేదీ వరకు యు ఎస్ ఏ లో జరిగే సమావేశాలకు అక్కడి నిర్వాహకులు ఆహ్వానం అందించారు. వారి ఆహ్వానం మేరకు డాక్టర్ నిల్ రోహిత్ రెడ్డి 28న మంగళవారం అమెరికా కు బయలుదేరారు.ఆ సభల్లో భారతదేశం లో ఎయిర్ అంబులెన్స్ సేవల గురించి వివరించడానికి ఒక ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు అనుమతించారు.

# ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**కాకినాడ మన జనప్రగతి జూలై 28:**–రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు.'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని 26వ డివిజన్‌లో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పర్యటించారు. ఈ సందర్భంగా గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను స్థానిక ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని, ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, పంతాడి రాజు, ఎం.డి. ఆన్సర్, సంఘాని నాగూర్, ఎం.డి. ఖాన్, సంఘాని గంగాధర్, కొనాడ ప్రకాష్, పాలెపు రాజు, కొల్లు ప్రకాష్, సంఘాని పెద్ద నూకరాజు, ఓలేటి ఆదినారాయణ, మేడ విజయ, మహమ్మద్ జహూర్, పూజారి రమ్య, సాహుల్ సయ్యద్, ఫైసల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్వీ ఆయుర్వేద కళాశాల విద్యార్థుల ఆరోగ్యం నిలకడ

- చికిత్స అనంతరంవిద్యార్థులందరికీ డిశ్చార్జ్
- మెరుగైన వైద్య సేవలు అందించాం: టీటీడీ జేఈవో డా.ఎ.శరత్




**తిరుపతి మన జనప్రగతి జూలై 28:**–తిరుపతిలోని ఎస్వీ ఆయుర్వేద కళాశాల బాలురు, బాలికల వసతి గృహాలకు చెందిన కొందరు విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురికాగా, వెంటనే వైద్య చికిత్స అందించి వారి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా నిలకడలోకి తీసుకువచ్చినట్లు టీటీడీ జేఈవో డా. ఎ. శరత్ తెలిపారు.మంగళవారం టీటీడీ సెంట్రల్ ఆసుపత్రిని సందర్శించిన జేఈవో, చికిత్స పొందుతున్న విద్యార్థులను స్వయంగా పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.అస్వస్థతకు గురైన వారిలో 20 మంది బాలికలు, 8 మంది బాలురు ఉన్నారు. వీరిలో 17 మంది బాలికలు, ముగ్గురు బాలురను అంబులెన్స్ ద్వారా టీటీడీ సెంట్రల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.విరేచనాలు, వికారం, స్వల్ప కడుపునొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థులకు ముఖ్య వైద్యాధికారి పర్యవేక్షణలో తక్షణమే అవసరమైన వైద్య సేవలు అందించారు. చికిత్సకు విద్యార్థులందరూ సానుకూలంగా స్పందించడంతో వారి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడిందని వైద్యులు తెలిపారు.వైద్యుల సూచన మేరకు విద్యార్థులందరినీ డిశ్చార్జ్ చేయగా, వారు తిరిగి వసతి గృహాలకు చేరుకుని సాధారణంగా భోజనం చేశారు. తుది వైద్య నివేదిక ప్రకారం అస్వస్థతకు గురైన విద్యార్థులందరూ ప్రస్తుతం సురక్షితంగా, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించినట్లు టీటీడీ జేఈవో డా. ఎ. శరత్ వెల్లడించారు.

# ఎర్రబల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

- పంట నమోదు చేయిస్తేనే ప్రభుత్వ పథకాలు
- మండల వ్యవసాయ అధికారి వి.చెన్నా రెడ్డి






**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 28:**రైతులందరూ తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు (ఈ–పంట) చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.చెన్నా రెడ్డి స్పష్టం చేశారు. పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లి–2 రైతు సేవా కేంద్రంలో ఆయన అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లబ్ధి పొందాలంటే ప్రతి రైతు తమ పంటను నమోదు చేయించుకోవడం బాధ్యతగా భావించాలని తెలిపారు. ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి ఒక్క పంట వివరాలను ఆర్బీకే (రైతు సేవా కేంద్రం) సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.పులివెందుల మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 5,069 ఎకరాలలో పంట నమోదు పూర్తయిందని ఎంఏఓ వెల్లడించారు. అందులో ప్రధానంగా అరటి 2,919 ఎకరాలు,బత్తాయి 1,845 ఎకరాలు,పత్తి 265 ఎకరాలు,వేరుశనగ 40 ఎకరాలు నమోదు చేయించుకున్నారని,ఇప్పటివరకు పంట నమోదు చేయించుకోని రైతులు వెంటనే సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.పంట బిమా (క్రాప్ ఇన్సూరెన్స్) ప్రీమియం చెల్లించే గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు చెన్నా రెడ్డి తెలిపారు.ఈ అవకాశాన్ని మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవ్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైన షిరిడి సాయిబాబా ఆలయం

- అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య







**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 28** :పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలోని మొట్టమొదటి షిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య,ఆలయ ప్రధాన అర్చకుడు మురళి స్వామి లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా నేడు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,ప్రత్యేక హారతులు ఇవ్వడం జరుగుతుందన్నారు.101 కలశాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.సాయంత్రం నాలుగు గంటల నుండి స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు వారి తెలిపారు.గ్రామోత్సవం చెక్కభజన కార్యక్రమం,తాళాల భజన కార్యక్రమం ఉంటుందన్నారు.గురు పౌర్ణమి సందర్భంగా ప్రతి ఒక్కరూ శిరిడి సాయిబాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకోవాలని వారు పిలుపునిచ్చారు.

# బీజేపీ ఆంధ్రప్రదేశ్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా నవాబ్ షేక్ సర్దార్ హుస్సేన్ బాధ్యతల స్వీకరణ



**కాకినాడ మన జనప్రగతి జూలై 28:**–భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేంద్ర కార్యాలయం, విజయవాడలో జరిగిన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ చేతుల మీదుగా, ఆంధ్రప్రదేశ్ బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా ఆధ్వర్యంలో నవాబ్ షేక్ సర్దార్ హుస్సేన్ అధికారికంగా భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో–కన్వీనర్గా బాధ్యతలు స్వీకరించారు.రాష్ట్ర స్థాయి బాధ్యతలు స్వీకరించిన సర్దార్ హుస్సేన్ ను వేలాదిమంది ప్రజలు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఘన స్వాగత ర్యాలీ నిర్వహించారు. ఈ భారీ ర్యాలీ ఆయన జన్మగ్రామమైన పెద్దాడ మీదుగా కొనసాగింది. అక్కడ తన తల్లి, అత్తగారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.అనంతరం ర్యాలీ ఆయన స్వగ్రామమైన రాజుపాలెం చేరుకోగా, గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది.అనంతరం రాజుపాలెంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నవాబ్ షేక్ సర్దార్ హుస్సేన్ మీడియా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో–కన్వీనర్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, మైనారిటీ వర్గాల్లో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన ప్రతి ఒక్కరిని నవాబ్ షేక్ సర్దార్ హుస్సేన్ స్వయంగా కలిసి వారి అభిమానానికి, ఆశీర్వాదాలకు, మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# దొండ్లవాగులో పొలం పిలుస్తోంది

**- మండల వ్యవసాయ అధికారి అంగోత్ రమేష్**




**లింగాల మన జనప్రగతి జూలై 28:**–లింగాల మండలంలోని దొండ్లవాగు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో భాగంగా పొచమిరెడ్డి రమణారెడ్డి సాగు చేసిన ప్రత్తి పంటను మండల వ్యవసాయ అధికారి రమేష్ క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పరిశీలించడం జరిగింది. వ్యవసాయధికారి రమేష్ మాట్లాడుతూ ఖరీఫ్ లో సాగు చేసిన ప్రత్తి పంటలో యాజమాన్య చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే పత్తి పంట ప్రస్తుతం 90 రోజుల దశలో ఉందని గులాబీ రంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని లీటర్ నీటికి ఫ్లుబెండమైడ్ 0.25 ఏం.ఎల్ లేదా క్లోరాంత్రానిలిప్రోలు 0.3 ఏం.ఎల్ లేదా బారజైడ్ 2.5ఏం.ఎల్మందును 10 గ్రాములు లీటర్ నీటికి 13:0:45 అనే మందుతో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులను సూచించారు.అలాగే రైతులందరూ కూడా తాము సాగు చేస్తున్న పంటలకు బీమా చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కామసముద్రం రైతు సేవ కేంద్రం ఇంచార్జి గంగాధర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఐజీసీ శిబిరానికి చిట్వేలు ఎన్‌సీసీ క్యాడెట్ ఎంపిక




**చిట్వేలి మన జనప్రగతి జూలై 28:**–చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ అక్షయ ఐజీసీ రాష్ట్రస్థాయి శిబిరానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ అక్షయను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు అక్షయ ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఎన్‌సీసీ వంటి కార్యక్రమాల్లో కూడా పాల్గొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల సైనిక్ శిబిరంలో భాగంగా జూలై 29వ తేదీ నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు విజయవాడ లోని తాడేపల్లిలో నిర్వహించనున్న ఐజీసీ శిబిరానికి అక్షయ ఎంపికైనట్లు తెలిపారు. గత రెండు నెలలుగా కడప, తిరుపతి ప్రాంతాల్లో నిర్వహించిన కఠినమైన ఎంపిక పోటీలను ఎదుర్కొని, ఫైరింగ్ విభాగంలోని జూనియర్ వింగ్‌లో అక్షయ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి శిబిరానికి ఎంపికైనట్లు తెలిపారు. ఐజీసీ శిబిరంలో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్యాడెట్లు తదుపరి జాతీయస్థాయి ఢిల్లీ క్యాంపులో పాల్గొనే అవకాశం ఉంటుందని వారు తెలిపారు. ఈ శిబిరంలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటారని తెలిపారు. అక్షయ ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీసిన టీడీపీ నాయకులు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 28:**–కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సూచనలతో 9వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి ఈవీ సుధాకర్ రెడ్డి అధ్యక్షతన, 10వ వార్డు ఇన్‌చార్జి నల్లబోతుల నాగరాజు ఆధ్వర్యంలో సుబ్బిరెడ్డి కొట్టాల ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, ఖలీల్, చెన్నయ్య, గంటసాల వెంకటేశ్వర్లు, దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మనజనప్రగతి

29- 07 - 2026

# రైతులు ఎవరు ఆందోళన చెందవద్దు.. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

**ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశాలతో ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటి విడుదలకు అధికారులు నిర్ణయం**

**'ప్రత్యేక సాగునీటి సలహా మండలి' సమావేశంలో ఎంపీ తంగెళ్ల**




**కాకినాడ మన జనప్రగతి జూలై 28:-**కాకినాడ జిల్లాలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఎకరాకు, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రత్యేక సాగునీటి సలహా మండలి' సమావేశంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా, కాకినాడ జిల్లాలో ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో సాగునీటి సరఫరాలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా ఇరిగేషన్ అధికారులతో నిరంతరం చర్చించడం జరిగిందన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్ చొరవతో సాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారంగా ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించినట్లు ఎంపీ తెలిపారు. ఈ నిర్ణయంతో పిఠాపురం నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి నిర్వహణ చర్యలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించామని, దీనికి సంబంధించిన నివేదికను పవన్ కళ్యాణ్‌కు సమర్పిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది తీవ్ర వర్షపాతం లోటు నమోదైందని, కాకినాడ జిల్లాలో సాగునీటి అవసరాలకు 14 టీఎంసీల నీరు అవసరముండగా ప్రస్తుతం కేవలం 8.2 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని ఎంపీ వివరించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రతి గ్రామంలో అధికారులు, రైతులు, లస్కర్లతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులందరూ పంటల బీమా చేయించుకునేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ రైతులకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు ఇస్తున్నారని ఎంపీ తంగెళ్ల తెలియజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి రెండేళ్ల సంక్షేమ అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం: మాజీ సర్పంచ్ దీన్నేపాడు రవిరాజు



**లక్కిరెడ్డిపల్లి మన జనప్రగతి జూలై 28:-** లక్కిరెడ్డిపల్లి మండలం దీన్నెపాడు గ్రామంలో మంగళవారం ఉదయం నరసింహరాజు పల్లె ప్రజలతో మమేకంలో గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒకరికి ప్రభుత్వం దిశగా లిరెండేళ్ల సంక్షేమ పాలనపై ఇంటింటి ప్రచారలో దిన్నెపాడు గ్రామం మాజీ సర్పంచ్ వీరబల్లి రవి రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సంక్షేమం అభివృద్ధి పైన ప్రజలకు వివరించి ఇంటింటి ప్రభుత్వం అభివృద్ధినీ గ్రామాల్లో వివరించారు. అదేవిధంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం 13వ బూతు నరసింహారాజు గారి పల్లెలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ప్రజలుకు తెలియజేస్తున్నాము. అలాగే మండలంలోని అన్ని పోలింగ్ బూతు కన్వీనర్లు, కేఎస్ఎస్ లు, క్లస్టర్ ఇంచార్జీలు యూనిట్ ఇన్చార్జులు గ్రామ అధ్యక్షులు కార్యదర్శులు, మండల నాయకులు గ్రామ నాయకులు రెండు సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బూతు కన్వీనర్ సంజీవరాజు తెలుగుదేశం నాయకులు సి ఎల్ రాజు వెంకటరాజు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'సేవే లక్ష్యం - రోటరీ ధ్యేయం' సావనీర్‌ను ఆవిష్కరించిన ఏఎస్పీ విభూ కృష్ణ



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 28:-** రోటరీ క్లబ్ ఆఫ్ ప్రొద్దుటూరు 202526 సంవత్సరానికి సంబంధించిన 'సేవే లక్ష్యం - రోటరీ ధ్యేయం' సావనీర్‌ను ప్రొద్దుటూరు ఎస్డిపిఓ కార్యాలయంలో ఏఎస్పీ విభూ కృష్ణ ఐపీఎస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్ రెడ్డి, పినాకిని జోన్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ కె.వి. మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 202526 సంవత్సరంలో రోటరీ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి, సెక్రటరీ షేక్ బాబా, ట్రెజరర్ దొంతు బాలాజీ, రొటేరియన్స్, దాతల సహకారంతో ప్రజలకు ఉపయోగపడే 35 సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారని కొనియాడారు. సమాజానికి రోటరీ సేవలను మరింత చేరువ చేయడంలో ఈ కార్యక్రమాలు విశేష పాత్ర పోషించాయని తెలిపారు. పాస్ట్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ, సభ్యులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేశానన్నారు. ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ చరిత్రలో తొలిసారిగా సీబీఐటీ కళాశాలలో యూనివర్సిటీ ఆధారిత రోటరాక్ట్ క్లబ్‌ను ఏర్పాటు చేయడం, అలాగే ప్రపంచ రోటరీ చరిత్రలోనే తొలిసారిగా వ్యవస్థాపకుడు పాల్ హారిస్ పేరుతో 'పాల్ హారిస్ ఉగాది సాహిత్య పురస్కారాలు' ప్రదానం చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. రోటరీ ట్రస్ట్ కార్యదర్శి బేపారి జాకీర్ అహమ్మద్ మాట్లాడుతూ, 202526 సంవత్సరంలో రోటరీ క్లబ్ సేవలను సమాజానికి విస్తృతంగా పరిచయం చేసిన అధ్యక్షుడు, సభ్యులను అభినందించారు. ఈ సేవా కార్యక్రమాల్లో తనకూ భాగస్వామ్యం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ గండ్లూరు శ్రీధర శర్మ, ట్రెజరర్ దొంతు బాలాజీ, డాక్టర్ మహమ్మద్ అయూబ్ ఖాన్, కె. రవికుమార్ రెడ్డి, షేక్ బాబా, పాలగిరి ఖాదర్ బాషా, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర ప్రసాద్, సీబీఐటీ రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షుడు చంద్రబాబు, శ్రీకాంత్, రాఘవ, శ్రీనందన్, కార్తికేయ రెడ్డి, ఫర్హాన్, ఎస్డిపిఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ/ఎస్టీల ఫిర్యాదుల పట్ల,సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం ధరణ్ కుమార్




**పీలేరు మన జనప్రగతి జులై 28:-**పీలేరులోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగిన ఎస్సీ /ఎస్టీలు చేసిన ఫిర్యాదులు మరియు వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని నేడు స్థానిక మాలమహానాడు కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పీలేరు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అగ్రకుల పెత్తందారులకు, అధికార పార్టీ నాయకుల సమస్యలకు అగ్ర తాంబూలం ఇచ్చి వెను వెంటనే రెడ్ కార్పెట్ వేసి సమస్యలు క్షణాలలో అధికారులే దగ్గర ఉండి రాచ మర్యాదలతో వచ్చిన వారి చొక్కాలు నలగకుండా వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. కానీ ఎస్సీ /ఎస్టీల ఫిర్యాదుల పట్ల గాని మరియు వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన పరిష్కార మార్గాలు కానరావడం లేదు రాజ్యాంగంలోని చట్టాలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి ఎస్సీ/ఎస్టీల సమస్యలు ఎప్పుడు పరిష్కారం అవుతాయో తెలియదు. కానీ ఎస్సీ/ఎస్టీల సహనాన్ని అధికారులు అలుసుగా తీసుకుంటే మాత్రం అధికారులు ఎప్పుడో అప్పుడు బాధపడే సందర్భాలు వస్తాయి స్వాతంత్ర్యానికి మునుపు ఉన్న వివక్ష నేడు ఎస్సీ /ఎస్టీల ఫిర్యాదుల పట్ల సమస్యల పట్ల స్పష్టంగా ప్రస్ఫుట మవుతున్నాయి. పీలేరులోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న అధికారులు ఇకనైనా రాజ్యాంగబద్ధంగా ఎస్సీ /ఎస్టీల ఫిర్యాదుల పైన,సమస్యలపైన పరిష్కారానికి సమయం కేటాయించాలని అయన డిమాండ్ చేశారు.


## లోకేష్ రాజీనామా డిమాండ్‌కు ప్రజల మద్దతు ఉంటే లైవ్ పోల్ నిర్వహించండి: జగన్‌కు వలిగట్ల సవాల్



**వాల్మీకిపురం మన జనప్రగతి జూలై 28:-**రాష్ట్ర కురుబ సంక్షేమ కార్పొరేషన్ అధ్యక్షులు వలిగట్ల వెంకటరమణ వాల్మీకిపురం పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2019 ఎన్నికల ముందు అప్పటి ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి మెగా డీఎస్సీ నిర్వహిస్తానని, ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ హామీలను అమలు చేయకుండా ఐదు సంవత్సరాల కాలాన్ని గడిపారని విమర్శించారు. అదే సమయంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ బాధ్యతలు చేపట్టిన మంత్రి నారా లోకేష్ విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, నాణ్యత పెంపునకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. అలాగే తొలి సంవత్సరంలోనే డీఎస్సీని ప్రకటించి సుమారు 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారని అన్నారు. ఈ నియామకాలపై అవినీతి ఆరోపణలు చేస్తూ, డీఎస్సీ ద్వారా నియమించబడిన ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేయాలని కొందరి ద్వారా న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేయించారని ఆరోపించారు. అయితే హైకోర్టు విచారణ అనంతరం ఆ పిటిషన్లను కొట్టివేసిందని, అనంతరం సుప్రీంకోర్టును ఆశ్రయించినా అక్కడ కూడా ఉపశమనం లభించలేదని పేర్కొన్నారు. కేంద్రంలో నీట్ పరీక్షల అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ విషయాన్ని రాష్ట్ర రాజకీయాలతో ముడిపెట్టి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం రాజకీయ ప్రేరేపిత చర్యగా కనిపిస్తోందని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోని అధిక శాతం నాయకులు, కార్యకర్తలు కూడా లోకేష్ పనితీరుపై సానుకూల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి బహిరంగ సవాల్ విసురుతున్నామని వలిగట్ల వెంకటరమణ తెలిపారు. "నారా లోకేష్ రాజీనామా చేయాలనే డిమాండ్‌కు ప్రజల మద్దతు ఉందని మీరు నమ్మితే, మీకు అనుబంధంగా ఉన్న మీడియా వేదికలోనే ప్రత్యక్ష ప్రజాభిప్రాయ సేకరణ (లైవ్ పబ్లిక్ పోల్) నిర్వహించండి. ఫలితం లోకేష్ రాజీనామాకు అనుకూలంగా వస్తే మీ వాదనకు బలం చేకూరినట్లే. ఒకవేళ వ్యతిరేకంగా వస్తే, అసత్య ప్రచారాలు చేసినందుకు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉండాలి" అని ఆయన అన్నారు.

# సమస్యలు యథాతథం.. పరిష్కారం శూన్యం

**• కలెక్టర్‌కు ఫిర్యాదు.. రెవెన్యూ అధికారుల తీరుపై అసంతృప్తి**



**ఉరవకొండ మన జనప్రగతి జూలై 28:-**ఉరవకొండ మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, పట్టాదారు పాస్‌బుక్‌ల రద్దు తదితర సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఇప్పటికీ పరిష్కారం లేకపోవడంతో ప్రెస్ అండ్ ఆర్టీఐ జనరల్ సెక్రటరీ మీనుగ మధుబాబు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌కు మరోసారి ఫిర్యాదు చేశారు. ఉరవకొండ పర్యటనకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు పత్రాలు, అధికారిక ఉత్తర్వుల ప్రతులను సమర్పించారు. వాటిని పరిశీలించిన కలెక్టర్, గతంలో జారీ చేసిన ఆదేశాలు అమలు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తహసీల్దార్, ఉప తహసీల్దార్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇప్పటికే ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. అలాగే లత్తవరం గ్రామంలోని ప్రభుత్వ భూమిపై జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమ రిజిస్ట్రేషన్లపై కూడా సమగ్ర నివేదిక కోరింది. ఆర్టీఐ చట్టం కింద పూర్తి సమాచారం అందించాలని ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో మార్పు కనిపించలేదని మధుబాబు తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

## గడపగడపకూ సంక్షేమ పథకాలు

**- లక్కిరెడ్డిపల్లిలో టీడీపీ ఇంటింటి ప్రచారం**



**రాయచోటి మన జనప్రగతి జూలై 28:-**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు లక్కిరెడ్డిపల్లి మండలంలోని 17వ వార్డులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ డా. ఎస్.ఎమ్.డి. షఫీ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. షఫీ నాయక్ మాట్లాడుతూ, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పాలన సాగించిందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మల్లి, అమీర్ భాషా, పక్కీరయ్య, అశోక్, కాంట్రాక్టర్ రాజు, చంద్ర, భాస్కర్ రెడ్డి, చల్లా శ్రీనివాసులు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీసీలకు,వీవోఏలకు లోకోస్ డేటా నమోదుపై శిక్షణ



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 28:-**బొమ్మనహాల్ మండల కేంద్రంలోని తుంగభద్ర మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం సీసీలు, యానిమేటర్లకు,గ్రామ సంఘం స్వయం సహాయక సంఘాల లోకోస్ డేటా నమోదు,మరియు క్రమబద్ధమైన లావాదేవీల నిర్వహణపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా ఏపియం,ఎం.సి. గంగన్న అధ్వర్యంలో యల్.సి.కామరాజు,మాట్లాడుతూ.. శిక్షణలో స్వయం సహాయక సంఘాల ప్రొఫైల్ నమోదు, మరియు కట్-ఆఫ్ డేటా నమోదు,సంఘాల రెగ్యులర్ సమావేశాల లావాదేవీల నమోదు,గ్రామ పేదరిక నిర్మూలన ప్రణాళికకు సంబంధించిన బాధ్యతల కేటాయింపు తదితర అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు,డిజిటల్ వ్యవస్థలో సమాచారాన్ని సకాలంలో, ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా సంఘాల పనితీరు మరింత మెరుగుపడుతుందని తెలిపారు,ఈ కార్యక్రమంలో మండల ఏపియం,ఎం.సి. గంగన్న,యల్.సి,కామరాజు,సీసీలు తిప్పయ్య,ఖజన్న,ఎర్రిస్వామి గవిసిద్ధ,అకౌంటెంట్ వరలక్ష్మి, రైతు ఉత్పత్తిదారుల అకౌంటెంట్ యానిమేటర్లు పాల్గొన్నారు.

## సబ్ కోర్టు ఏర్పాటు విషయంలో హైకోర్టు జడ్జిలను కలిసిన న్యాయవాదుల సంఘం నాయకులు.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 28:-** కర్నూలు జిల్లా పత్తికొండలో సబ్ కోర్టు ఏర్పాటుకు సహకరించాలని పత్తికొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుబాబు ఆధ్వర్యంలో మంగళవారం అమరావతిలోని హైకోర్టులో నలుగు న్యాయమూర్తులను కలిశారు. పోటు పోలియో జడ్జి సురేష్ రెడ్డికి సబ్ కోర్టు విషయంలో వినతిపత్రం సమర్పించారు. పత్తికొండ డివిజన్ అయిందని, ఇక్కడ డిఎస్పీ ఆర్డీవో కార్యాలయాలతో పాటు కేసులు కూడా ఎక్కువ ఉన్నాయని, సబ్ కోర్టు ఏర్పాటుకు సిఫార్సు చేయాలని న్యాయవాదుల సంఘం సభ్యులు హైకోర్టులో హైకోర్టు జడ్జిలు శ్రీనివాస్ రెడ్డి, హరిహరనాథ శర్మ, హరినాథ్ రెడ్డిలను కలిసి సబ్ కోర్ట్ విషయంలో విన్నవించారు. ఇచ్చిన వినతి పై చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం నాయకులు జడ్జీలకు శాలువాలు కప్పి, పూల బొకేలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం సభ్యులు జగదీష్, రవికుమార్, సూరజ్ నబి, న్యాయవాదులు రవి ప్రకాష్, సుధా కృష్ణ, అలీ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో ప్రైవేటు బడుల కళకళ.. ప్రభుత్వ బడుల వెలవెల.


**• మాజీ ఎంపీ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి జులై 28:**–రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ బడులు కుదేలయ్యాయని, విద్యారంగం అదోగతి పాలయ్యిందని మాజీ ఎంపీ,రాష్ట్ర కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు.ఈ ప్రభుత్వ పాలనలో సర్కారు బడులు వెలవెల బోతుండగా , ప్రైవేట్ బడులు కళకళలాడుతున్నాయన్నారు. వేంపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర విద్యా శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారము ఏడాది కి ఏడాది కి ఆంధ్రప్రదేశ్లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల సంఖ్య, అందులో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుండగా,ప్రైవేట్ పాఠశాలల సంఖ్య, వాటిలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోందన్నారు . 2023 – 24 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 45991ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా 2025–26 నాటికి ఆ సంఖ్య 45019 అయిందన్నారు . అంటే దీన్నిబట్టి 972 ప్రభుత్వ పాఠశాలలు మూతపడి నట్లని ఆయన పేర్కొన్నారు . అదే సమయంలో ప్రైవేట్ పాఠశాలల సంఖ్య 478 పెరిగిందన్నారు. 2023 –24 లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 41, 75,600 ఉండగా 2025– 26 నాటికి 35 లక్షల 89 వేల 160 కి తగ్గింది అంటే ప్రభుత్వ పాఠశాలల్లో కూటమిపాలనలో విద్యార్థుల సంఖ్య 5 లక్షల 86 వేల 440 తగ్గిందని,అదే సమయంలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రెండు లక్షల 86 వేల 916 పెరిగిందన్నారు . వాస్తవానికి చెప్పాలంటే ఈ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నానాటికి తీసి కట్టుగా తయారవుతున్నాయన్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం గురించి గొప్పలు చెబుతోందని, మరొకవైపు 972 ప్రభుత్వ పాఠశాలలు మూతపడి 5 లక్షల 86 వేల 440 మంది విద్యార్థులు తగ్గిపోయారన్నారు. విద్యాభివృద్ధిపై ఈ ప్రభుత్వం చెబుతున్నదొకటి వాస్తవంగా రాష్ట్రంలో ఉన్నదొకటని ఆయన పేర్కొన్నారు. కేవలం సామాజిక మాధ్యమాల్లో విద్యాభివృద్ధిపై ప్రభుత్వ పబ్లిసిటీ మాత్రమే ఉందని, చేతల్లో ఏమీ లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సెల్ఫ్ డబ్బా భువనేశ్వర్ మానుకొని విద్యారంగం అభివృద్ధికి పటిష్టమైన, నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకోవాలన్నారు.

# నల్లగుట్టపల్లి గ్రామ వివోలో శ్రీనిధి డబ్బులు గోల్మాల్ అంట..

**• తస్మాన్ జాగ్రత్త పట్టించుకోని వెలుగు సిబ్బంది.**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 27:**–ప్రభుత్వం పేద ప్రజలను ఉద్దేశించి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామాల్లో శ్రీనిధి డబ్బులను గ్రామాల్లోని వివోఏలు సంఘ సభ్యుల తెలియకుండా సీసీల అండతో శ్రీనిధి నుండి డబ్బులను డ్రా చేసి సభ్యులకు తక్కువ మొత్తంలో అందించడం, మరియు సంఘ సభ్యులు తీసుకున్న శ్రీనిధి మొత్తం డబ్బులు చెల్లించిన సంఘ సభ్యులకు రసీదులు ఇవ్వకుండా మధ్య పెడుతూ జాగ్రత్త వహిస్తూ లక్షల రూపాయలు శ్రీనిధి డబ్బు ఇంకా సంఘ సభ్యులు కట్టవలసి వస్తుందని సంఘ సభ్యులతో చెప్పడంతో వివోఏ ల గుట్టు రట్టు అయినట్లు కొంతమంది సంఘ సభ్యుల ద్వారా ఆలస్యంగా తెలుగులో వచ్చింది.అన్నమయ్య జిల్లా రామాపురం మండలం లోని నల్లగుట్ట పల్లి పంచాయతీ లో నల్లగుట్టపల్లి వివో లో లక్ష్మీ వెంకటేశ్వర సంఘం నందు రెండు లక్షల దుర్వినియోగం జరిగిందనీ సంఘ సభ్యుల ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఏమీ తెలియని సంఘ సభ్యుల ద్వారా ఇంకా ఎంత డబ్బు దుర్వినియోగం చేసి కాగేస్తున్నారు అని మిగిలిన సంఘ సభ్యులు భయభ్రాంతులకు గురి అవుతున్నారని తెలిసింది. నల్లగుట్టపల్లి పంచాయతీ సీసీ విధులకు వచ్చినప్పటి నుంచి ఇంతవరకు వివో మీటింగ్ జరపలేదనీ సంఘ సభ్యులకు ఎటువంటి రసీదులు ఇవ్వ కుండ నెల నెల సంఘాల దగ్గర డబ్బులు వసూలు చేసి ఆ డబ్బులు సంఘానికి ట్యాగ్ చేయకుండా తన పర్సనల్ అవసరానికి వాడుకొని సంఘాల మీద ఇంకా మీ సంఘం అప్పు ఉంది అని తెలియజేస్తున్నరని తెలిపారు రామాపురం మండలానికి ఇన్చార్జి ఏపిఎం నల్లగుట్టపల్లి పంచాయతీకి సిసి ఉన్నా పక్కక్లస్టర్ నుండి వేరే సిసి విధులు నిర్వహిస్తాడనీ కొంతమంది సంఘ సభ్యులు తెలిపారు నల్లగొండ పల్లి వివోఏ అయినటువంటి కొత్తపల్లి విజయ లక్ష్మి నల్ల గుట్ట పల్లి పంచాయతీలో పనిచేస్తుందనీ ఆమె పరిధిలో 38 సంఘాలు ఉన్నాయనీ అన్ని సంఘాలలో శ్రీనిధి దుర్వినియోగం ఉందనీ సంఘ సభ్యులు మేల్కొని తమ తమ అప్పులు, జమ్ములు సరిచూసుకొని మేల్కొనాలని సంఘ సభ్యులు కొంతమంది ఆరోపిస్తున్నారు వివో మీటింగ్ కి అధ్యక్షులు మరియు సిసి 8 సంవత్సరాల నుంచి ఒకరినే అధ్యక్షులుగా ఉంచారనీ ఒక్కసారి కూడా అధ్యక్షులను మార్చలేదనీ చెక్కులమీద ఫోర్జరీ సంతకాలు పెట్టి సంఘ సభ్యులకు మినిట్స్ బుక్కులు సంఘాల దగ్గర లేకుండా వివో ఏ ఉంచుకున్నదనీ వాళ్లకు ఇవ్వడం లేదనీ బ్యాంకు లింకేసులు కూడా దుర్వినియోగం ఉందనీ అని సంఘ సభ్యులు కొంతమంది ఆరోపిస్తున్నారు. అంతేకాక నల్లగుట్టపల్లె వివోఏ మునుపు పక్క గ్రామమైన శుద్ధ మల్ల వాస్తవ్యురాలని ఆ గ్రామంలో మునుపు డబ్బు దుర్వినియోగం చేసిన ఆరోహణ రుజువై ఆమెను తొలగించడం జరిగిందని ప్రస్తుతం నల్లగుట్టపల్లి వివో ఏ గా ఆఫీసు సిబ్బందితో లాలూచీపడి సంఘ సభ్యులను మధ్యపెట్టి డబ్బులు సంపాదించడం చేస్తుందని కొంతమంది సంఘ సభ్యుల ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వారి వల్ల పేదలైనటువంటి సంఘ సభ్యులు నష్టపోతారని ప్రత్యేక కాక ప్రభుత్వ అందిస్తున్న నిధులు పేదలకు అందకుండా దుర్వినియోగం జరిగి అదు ప్రభుత్వానికి అటు అధికారులకు చెడ్డపేరు వస్తుందని ఆరోపిస్తున్నారు ఏది ఏమైనా ఇలాంటి వారిని తొలగించి సొంత గ్రామం అయిన నిరుద్యోగులకు స్థానం కల్పిస్తే బాగుంటుందని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

# నూతన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించిన చైర్మన్ భాను ప్రకాష్



**లింగాల మన జనప్రగతి జులై 28:**–మండల కేంద్రమైన లింగాలలో నూతనంగా 40 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని మంగళవారం బిజెపి పార్టీకి చెందిన వైయస్ఆర్ కడపజిల్లా గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ భాను ప్రకాష్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రమైన లింగాలలో గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతూ ఉందన్నారు. పాడ నిధుల కింద 2022–23లో సుమారు 40 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడంతో నూతన భవనం నిర్మాణం పూర్తయింది అన్నారు. వారం రోజుల్లోపు అద్దె భవనంలో నుంచి గ్రంథాలయాన్ని నూతన భవనంలోనికి మార్పు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సిబ్బంది, బిజెపి నాయకులు బెస్త రాజశేఖర్, తేరా మహేశ్వర్ రెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆగస్టు 2న ప్రొద్దుటూరులో జిల్లాస్థాయి అండర్-18,అండర్-20 అథ్లెటిక్స్ పోటీలు

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జులై 28:**–భాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రొద్దుటూరులోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో జిల్లాస్థాయి అండర్–18, అండర్–20 స్త్రీ, పురుషుల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి వై. అహ్మర్ భాషా, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బసిరెడ్డి వీర కళ్యాణ్ రెడ్డి తెలిపారు.అండర్–18 విభాగంలో (18–09–2008 నుంచి 17–09–2010 మధ్య జన్మించిన వారు), అండర్–20 విభాగంలో (18–09–2006 నుంచి 17–09–2008 మధ్య జన్మించిన వారు) పాల్గొనవచ్చని పేర్కొన్నారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 1000 మీటర్ల పరుగులు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కడప జిల్లా పరిధిలోని అర్హులైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చుని, ప్రతిభ కనబరిచిన వారిని ఆగస్టు 11, 12, 13 తేదీల్లో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో జరిగే రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక చేస్తామని వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేవారికి కనీసం 16 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని తెలిపారు.పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు నిర్ధారణ కోసం ఆధార్ కార్డు లేదా జనన ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని సూచించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.మరిన్ని వివరాలకు వై. అహ్మర్ భాషా (కార్యదర్శి, భాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్)ను 99496 86586, 80198 80995 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

**- రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి బూసినే చంద్రశేఖర్ డిమాండ్**



**దేవనకొండ మన జనప్రగతి జులై 28:**–ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి ఆధ్వర్యంలో సోమవారం కర్నూలులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి బూసినే చంద్రశేఖర్ మాట్లాడుతూ, డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ భృతి అమలుపై స్పష్టత లేకపోవడం నిరుద్యోగ యువతలో ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, బీవీఆర్ అభిమానులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు స్వయం ఉపాధి, స్టార్టప్‌లపై విద్యార్థులకు కెరీర్ అవగాహన

**ఉజ్వల భవిష్యత్తుకు స్పష్టమైన లక్ష్యం ప్రణాళిక అవసరం: జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్ కుమార్**






**కడప మన జనప్రగతి జులై 28:**– ఉజ్వల భవిష్యత్తుకు స్పష్టమైన లక్ష్యం ప్రణాళిక అవసరమని జిల్లా ఉపాధి అధికారి ఎ. సురేష్ కుమార్ అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, యోగి వేమన విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం యూనిట్9 సంయుక్త ఆధ్వర్యంలో "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, స్వయం ఉపాధి, స్టార్టప్‌లపై కెరీర్ అవగాహన సదస్సు" మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ భవిష్యత్తుకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు."విజయం ముందుగా మన ఆలోచనల్లో రూపుదిద్దుకుంటుందని ఆ తర్వాతే నిజ జీవితంలో సాకారమవుతుంది" అనే సందేశంతో విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు.తొమ్మిదో తరగతి నుంచే ఉన్నత విద్య, పరిశోధన (రిసెర్చ్) వరకు ప్రతి దశలో సరైన కెరీర్ ప్రణాళికను రూపొందించుకోవడం అవసరమని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధి, స్టార్టప్‌లు, విదేశీ ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు.ముఖ్యంగా విద్యార్థినులు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, రుణ సదుపాయాలు, అలాగే స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న అవకాశాలను వివరించారు.ప్రభుత్వ ఉద్యోగాల వల్ల కలిగే స్థిరమైన ఆదాయం, ఉద్యోగ భద్రత, ఉచిత వైద్య సదుపాయాలు, వేతనంతో కూడిన సెలవులు, పదోన్నతులు, గృహ అద్దె భత్యం (హెచ్ఆర్ఏ), పనివ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత , సామాజిక గౌరవం, దేశసేవ చేసే అవకాశం వంటి అనేక ప్రయోజనాలను వివరించారు.బ్యాంకింగ్, రైల్వేలు, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రక్షణ శాఖ, సివిల్ సర్వీసెస్, పోస్టల్, బీమా రంగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు , శాస్త్రీయ పరిశోధనా సంస్థలు తదితర విభాగాల్లో అందుబాటులో ఉన్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, జీఎస్టీ ఇన్స్పెక్టర్, బ్యాంక్ ప్రొబేషనరీ ఆఫీసర్, రైల్వే స్టేషన్ మాస్టర్, జూనియర్ ఇంజినీర్ తదితర ఉద్యోగాల అర్హతలు, ఎంపిక విధానం, పరీక్షల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ, సరైన సమాచారం, అవగాహన లేకపోవడం వల్ల అనేక అవకాశాలను కోల్పోతున్నారని ఎన్.ఎస్.ఎస్ యూనిట్ –9పీవో శ్రీనివాసరావు అన్నారు. పేర్కొన్నారు. ఇటువంటి కెరీర్ అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకుని, తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# చంద్రబాబు పాలనలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యం

**• గోవిందవాడలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం**




**బొమ్మనహాల్ మన జనప్రగతి జులై 28:**–రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం..రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా బొమ్మనహాల్ మండలంలోని గోవిందవాడ గ్రామంలో ప్రభుత్వ విప్,రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశాల యూనిట్ ఇంచార్జ్,కావలి వేమన్న,బీఎల్ఏలు కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోందన్నారు,గత రెండేళ్లలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు,నిధులు తీసుకువచ్చి మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు,రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు తన అనుభవం, పరిపాలనా సామర్థ్యంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టారని పేర్కొన్నారు,పేద,బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వ ని చే స్తో ం ద ని , ఎ న్ని క ల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను దశలవారీగా అమలు చేస్తోందని వి వ రి ం చా ర ు . క ు ల , మత,ప్రాంతాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని మరియు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నాయకత్వం బలపరచాలని పిలుపునిచ్చారు,ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి ప్రభుత్వానికి మరింత మద్దతు కూడగట్టాలని కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో గోవిందవాడ గ్రామ తెలుగుదేశం పార్టీ నా య క ు ల ు , బీ ఎ ల్ ఏ ల ు , య ు వ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు, పాల్గొన్నారు.

మనజనప్రగతి

29- 07 - 2026

# అధికారులు నిజాలు వెల్లడించేంతవరకు వెనక్కు తగ్గేది లేదు.



**చిట్వేలి మన జనప్రగతి జూలై 28:-** వెనుకబడిన వర్గాలకు జీవనోపాధి నిమిత్తం ప్రభుత్వం కేటాయించిన చేపల చెరువు అనుమతిని ఇష్టానుసారం ఇతరులకు కట్టబెట్టడం ఏమిటని జనసేన నాయకులు ఆనాల సునీల్ ప్రశ్నించారు. చిట్వేలి మండలం ఎల్లమరాజు చెరువు దగ్గర గిరిజన కుటుంబీకుల పక్షాన నిలిచి నిరసన తెలుపుతూ ఆవేదన వ్యక్తపరిచారు. గడిచిన మూడు సంవత్సరాలుగా చెర్లోపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చెరువుపై గుత్తాధిపత్యం చలాఇస్తూ పేదలైన చుట్టుపక్కల గ్రామాల యానాదుల కుటుంబీకులను అడ్డుకుంటూ దౌర్జన్యం కొనసాగిస్తున్న వారికి కొందరు అధికారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు విమర్శించే స్థాయిలో పాలక పక్షంలో ఉన్న కొందరు దిగజారి ప్రవర్తిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం చెరువు చేపల వేటకు గడువు జూన్ చివరినాటికి ముగిసినప్పటికీ సోమవారం సాయంత్రం వలలు వేసిన యానాదులపై ఎలాంటి హక్కులు లేని కొందరు రౌడీయిజం చేయడం ఏమిటని అన్నారు. హక్కుదారులు ఎవరు, ప్రస్తుతం చేపలు పట్టి అనుభవిస్తున్నది ఎవరు జిల్లా కలెక్టర్ నిజాలను పరిశీలించి మండల పరిధిలో వందల కుటుంబాల గిరిజనులకు చేపలు పట్టేందుకు అనుమతి ఇచ్చి జీవనోపాధి కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని, కూటమి ప్రభుత్వంలో కొందరు ప్రవర్తిస్తున్న తీరుతో పార్టీకి కలుగుతున్న ఇబ్బందిని తెలియపరుస్తామన్నారు. వారి దగ్గర ఉన్న అనుమతి పత్రాలను బహిర్గతం చేయకపోతే నిరసన ఉధృతి చేస్తామని, బెదిరింపులకు భయపడేది లేదని అన్నారు. వాస్తవ హక్కుదారులకు డబ్బులు ఆశ చూపి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఉచిత చేపలను లక్షలకు అమ్ముకుంటూ అరాచకం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేదలకు జీవన భృతి కల్పించాలని జిల్లా యంత్రాంగం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాదినేని కనకరాజు, పగడాల శివ, పగడాల వెంకటేష్, మించల బాలకృష్ణ యాదవ్, మాదినేని రాజా, చిన్నారాయల్, ప్రసాద్, బాదిత యానాదుల కుటుంబీకులు పాల్గొన్నారు.

# సమస్యలు యథాతథం..పరిష్కారం శూన్యం

**● కలెక్టర్‌కు ఫిర్యాదు.. రెవెన్యూ అధికారుల తీరుపై అసంతృప్తి**



**ఉరవకొండ మన జనప్రగతి జూలై 28:-**ఉరవకొండ మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, పట్టాదారు పాస్‌బుక్‌ల రద్దు తదితర సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఇప్పటికీ పరిష్కారం లేకపోవడంతో ప్రెస్ అండ్ ఆర్టీఐ జనరల్ సెక్రటరీ మీనుగ మధుబాబు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌కు మరోసారి ఫిర్యాదు చేశారు. ఉరవకొండ పర్యటనకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు పత్రాలు, అధికారిక ఉత్తర్వుల ప్రతులను సమర్పించారు. వాటిని పరిశీలించిన కలెక్టర్, గతంలో జారీ చేసిన ఆదేశాలు అమలు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తహసీల్దార్, ఉప తహసీల్దార్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇప్పటికే ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. అలాగే లత్తవరం గ్రామంలోని ప్రభుత్వ భూమిపై జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమ రిజిస్ట్రేషన్లపై కూడా సమగ్ర నివేదిక కోరింది. ఆర్టీఐ చట్టం కింద పూర్తి సమాచారం అందించాలని ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో మార్పు కనిపించలేదని మధుబాబు తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

# తొండూరులో నేడు గురుపౌర్ణమి మహోత్సవాలు

**సాయిబాబా ఆలయ రజతోత్సవ వేడుకలు..**

**ప్రత్యేక పూజలు,హోమాలు,గ్రామోత్సవానికి ఏర్పాట్లు**



**తొండూరు మన జనప్రగతి జూలై 28:-** మండలంలోని తొండూరు శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో నేడు గురుపౌర్ణమి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ కమిటీ ఘనంగా ఏర్పాటు చేసింది. వేకువజాము నుంచే సాయిబాబా వారికి మహాభిషేకం, హోమం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి శ్రీహరి తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయనున్నారు. సాయంత్రం భజన బృందం ఆధ్వర్యంలో తాళాల భజనలు, బాబా గ్రామోత్సవం, కోలాట ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించినట్లు తెలిపారు. ఆలయ రజతోత్సవ వేడుకల్లో పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు వెల్లడించారు.

# 8 నెలలుగా వేతనాల్లేక తాగునీటి వర్కర్ల దుస్థితి

**- కుటుంబ పోషణ భారమై అప్పులపాలు..: కలెక్టర్‌కు వినతి**



**ఉరవకొండ మన జనప్రగతి జూలై 28:-**ఉరవకొండ ప్రాంతీయ తాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న వర్కర్లు గత ఎనిమిది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలను వెంటనే విడుదల చేసి, ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ రేట్ల ప్రకారం పూర్తి వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వర్కర్లు మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంతో పాటు పరిసర ఏడు గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పథకంలో 21 మంది సిబ్బంది గత 24 ఏళ్లుగా నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎండా వానా ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు తాగునీరు అందిస్తున్నప్పటికీ, గత ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందన్నారు. ఇంటి అద్దెలు, పిల్లల చదువుల ఫీజులు, నిత్యావసర ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ రేట్ల ప్రకారం నెలకు రూ. 20,700 వేతనం చెల్లించాల్సి ఉండగా, తమకు కేవలం రూ. 12,000 మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రతి నెలా ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు, షెడ్యూల్ రేట్ల ప్రకారం పూర్తి జీతం చెల్లించాలని, పెన్షన్, ప్రమాద బీమా వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వర్కర్లు మల్లికార్జున, చిన్నబాబు, ఉమాపతితో పాటు పలువురు బాధితులు పాల్గొన్నారు. తమ సమస్యపై జిల్లా అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.

# అధిక శబ్దాన్ని పెంచే బుల్లెట్ సైలెన్సర్లు, ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లపై ప్రత్యేక తనిఖీలు



**రైల్వే కోడూరు మన జనప్రగతి జూలై 28:-** రైల్వే కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అనధికారికంగా మార్పులు చేసిన బుల్లెట్ సైలెన్సర్లు, నిబంధనలకు విరుద్ధమైన ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు, అనుమతి లేని స్టిక్కర్లు, అలాగే మైనర్లు వాహనాలు నడపడంపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తిరుపతి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, రేణిగుంట సబ్-డివిజన్ డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ తనిఖీలు చేపట్టినట్లు రైల్వే కోడూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. తనిఖీల సందర్భంగా అధిక శబ్దం వచ్చేలా చట్టవిరుద్ధంగా మార్పులు చేసిన బుల్లెట్ సైలెన్సర్లు, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు, పోలీస్, ప్రెస్, రెవెన్యూ తదితర అనుమతి లేని స్టిక్కర్లతో సంచరిస్తున్న వాహనాలను గుర్తించి, సంబంధిత వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి మినహాయింపు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేడే స్వచ్ఛ పథం కార్యక్రమానికి శ్రీకారం

**వీరబల్లి మన జనప్రగతి జూలై 28:-**నేడు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.గౌస్ భాష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బుధవారం అన్ని గ్రామ పంచాయతీలలోస్వచ్ఛ పథం కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.ముఖ్యంగా రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పల తొలగింపు, పేరుకుపోయిన వ్యర్థాల నిర్మూలన, వ్యర్థాల వర్గీకరణ మరియు వర్గీకరించిన వ్యర్థాలను ఎస్ డబ్ల్యూ పి సి లకు లేదా ఇతర గుర్తించిన ప్రదేశాలకు తరలింపు పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బెస్ట్ స్వచ్ఛ పథం జరిగిన వాటి తాలూకు ముందు మరియు తరువాత ఫోటోలు కలెక్ట్ చేసి, డాక్యుమెంట్ చేసి, షేర్ చేయాలన్నారు. అందరు పిడి ఓ లు తమ లాగిన్ లలో స్వచ్ఛ పథం జరిగిన వివరాలను వారికి కేటాయించిన అంతర్జాలంలో ఫోటోగ్రాఫ్ లతో అప్డేట్ చేయాలన్నారు. ఖచ్చితమైన వివరాలను మాత్రమే నమోదు చేయాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# త్రాగు నీళ్లిచ్చి పుణ్యం కట్టుకోండి మహా ప్రభో..?



**వీరబల్లి మన జనప్రగతి జూలై 28:-**నీళ్లిచ్చి పుణ్యం కట్టుకోండి మహా ప్రభో అని మంగళవారం మండలం లోని వంగి మళ్ళ గ్రామ పంచాయతీలో ని ఆమూరి వాండ్లపల్లి ప్రజలు కాలీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. గత నెల నుండి నీటి ఎద్దడి ఏర్పడి తాము నానా ఇబ్బందులకు గురవుతున్నామనీ వాపోయారు. వివరాల్లోకి వెళితే ఈ గ్రామంలో దాదాపు 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. వీరు కూలీ పనులు చేసుకుని బ్రతుకుతున్నారు.గత నెల నుండి నీళ్లు లేకపోవడంతో అనేక సమస్యలతో బాధపడుతున్నారు.చుట్టుపక్కల వ్యవసాయ బావులు నుండి నీరు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. మంగళవారం గ్రామంలో నీటి సమస్య తీర్చాలంటూ ఖాళీ బిందెలతో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరచిన అనంత విద్యార్థినిలు




**ఆళ్లగడ్డ మన జనప్రగతి జూలై 28:-**

ఆళ్లగడ్డలో మంగళవారం జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 పోటీల్లో ఆళ్లగడ్డ అనంత డిగ్రీ కళాశాల విద్యార్థినులు విశిష్ట ప్రతిభ కనబరిచా రు. వాలీబాల్ విభాగంలో అండర్-17 విభాగం నుంచి ఎం.స్వాతి, అండర్-23 విభాగం నుంచి ఎం. ఆసియా, ఎల్. రుక్సానా జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరాచారి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా క్రీడల్లో మరింత ప్రతిభ కనబరచాలన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం తమ విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని, క్రీడలకు ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తూ అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

# ఉరవకొండలో అక్రమాలపై జూలై 31న మహాధర్నా: వైఎస్సార్‌సీపీ ప్రకటన



**అనంతపురం మన జనప్రగతి జూలై 28:-** ఉరవకొండ నియోజకవర్గంలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అవినీతి, భూ ఆక్రమణలు, హంద్రీ-నీవా కాలువ పనుల్లో అవకతవకలు, పేకాట క్లబ్బులు, బెల్ట్ షాపుల నిర్వహణ తదితర అంశాలపై నిరసనగా ఈ నెల 31న ఉరవకొండ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకటించారు. అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న అక్రమాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌పై విమర్శలు గుప్పిస్తూ, టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలపై స్పందించకుండా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న ప్రజా ఉద్యమాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వేల్పుమడుగు భూముల వివాదం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, దేవాలయ భూముల అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని కోరారు. అలాగే కోర్టు ఉత్తర్వుల అమలు, సంబంధిత అధికారుల వ్యవహారశైలిపైనా ప్రశ్నలు లేవనెత్తారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ, మాజీ పీపీ హరినాథ్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కురుబ దేవేంద్ర, కురుబ గోవిందు, కురుబ సురేష్, బెస్త తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174